కలెక్టర్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన జాతీయ స్థాయి పర్యవేక్షణ బృందం

విశాలాంధ్ర-పార్వతీపురం : కేరళ నుంచి వచ్చిన జాతీయ స్థాయి పర్యవేక్షణ బృందం (నేషనల్ లెవెల్ మోనిటరింగ్ టీమ్) జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ను శుక్రవారం క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ బృందం గత 8 రోజులుగా జిల్లాలోని 11 గ్రామ పంచాయతీలను సందర్శించి కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుతీరును క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేసింది. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి అభిప్రాయాలను సేకరించింది. జిల్లాలో పథకాల అమలుతీరు బాగుందని, పర్యవేక్షణ చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. తమ పర్యవేక్షణలో జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహాయ సహకారాలు అందించినందుకు బృందం సభ్యులు కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్ర ఏపీటిఎఫ్ మహాసభలను విజయవంతం చేసిన వారందరికీ ధన్యవాదాలు

రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటనాయుడు

విశాలాంధ్ర-సీతానగరం: ఈనెల 6,7,8 తేదీలలో విజయనగరంలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 80 వసంతాల జూబ్లీ వేడుకలు మరియు 20 విద్యా-వైజ్ఞానిక మహాసభలకు రాష్ట్రం నలుమూలల నుండి అధిక సంఖ్యలో హాజరైన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పించనదారులందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దాసరివెంకట నాయుడు తెలిపారు. శుక్రవారంనాడు సీతానగరంలో విలేకరులతో మాట్లాడారు. నేటి ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ నాడు ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఉపాధ్యాయ ఫెడరేషన్ గా 1944 ఏప్రిల్ 16న స్థాపించబడి 16 ఏప్రిల్ 2024కి 80 వసంతాలను ప్రారంభ కార్యక్రమంగా ఫెడరేషన్ పుట్టిన గడ్డమీద తాపేశ్వరంలో నిర్వహించడం జరిగినదని తెలిపారు. రాష్ట్ర మహాసభలను విజయనగరంలో అత్యంత ఘనంగా నిర్వహించడం జరిగినదన్నారు. మొదటిరోజు అనేకమంది అతిరథ మహారథులందరూ వేదికపై ఆసీనులై ఫెడరేషన్ యొక్క ఖ్యాతిని తెలియజేయడం జరిగినదన్నారు.రెండో రోజు విద్యా సదస్సును నిర్వహించడం జరిగినదన్నారు. మూడోరోజు జరిగిన ప్రతినిధులు సభలో నేటి పరిస్థితుల్లో ఉపాధ్యాయ ఉద్యమం లక్ష్యం-తక్షణకర్తవ్యం -ఎదుర్కొంటున్న సమస్యలు అనే అంశంపై చర్చా పత్రం చర్చించి ఆమోదించడం జరిగినదన్నారు. ప్రస్తుతం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పించనదారులు విద్యార్థులు, సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై తీర్మానాలు చేసి ఆమోదించడం జరిగినదన్నారు. వీటిని ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందని తెలిపారు. సీతానగరం మండలంలో జన్మించి ఫెడరేషన్‌కు విశేష సేవలందించిన కీర్తిశేషులు కామ్రేడ్ పి.నాగభూషణరావు కుటుంబానికి మహాసభల సావనీర్ కాపీలను అందించడం జరిగిందన్నారు. ఈపత్రికా సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పువ్వల ధనుంజయ రావు, సీతానగరం మండలశాఖ అధ్యక్ష ,ప్రధానకార్యదర్శులు ఎస్ సత్యంనాయుడు, పి.సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షులు ఎం గౌరీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీల్లో హైరిస్క్ ఆరోగ్య సమస్యలను సకాలంలో గుర్తించాలి

విశాలాంధ్ర-వీరఘట్టం/బెలగాం : గర్భిణీల్లో హైరిస్క్ ఆరోగ్య సమస్యలను సకాలంలో గుర్తించాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు వీరఘట్టం మండలం బిటీవాడ పిహెచ్సిలో పిఎంఎస్ఎంఎ కార్యక్రమాన్ని గురువారం పరిశీలించారు. గర్భిణీలకు నిర్వహించిన ఆరోగ్య తనిఖీలు, పరీక్షలను పరిశీలించి మాతాశిశు సంక్షేమ కార్డులను తనిఖీ చేసారు. ఎప్పటికప్పుడు వివరాలు నమోదు పూర్తి చేయాలన్నారు. ల్యాబ్ లో గర్భిణీలకు చేపట్టిన హిమోగ్లోబిన్ పరీక్షలను పరిశీలించగా రక్తహీనతగా గుర్తించిన వారికి పిహెచ్సీ వార్డులో ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్స్ ను వైద్య సిబ్బంది ఇస్తున్న తీరును పరిశీలించారు. గర్భిణీలతో మాట్లాడి వారికి క్షేత్ర స్థాయిలో అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రం నుండి అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రతీ రోజూ క్రమం తప్పకుండా ఐరన్, కాల్సియం మాత్రలు వేసుకోవాలన్నారు. అనంతరం డాక్టర్ జగన్మోహన్ సిబ్బందితో సమీక్ష జరిపి పలు సూచనలు చేశారు. పిహెచ్సిలో ప్రసవాలు ఎక్కువగా జరిగేలా చూడాలన్నారు. హైరిస్క్ గర్భిణీలు పై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తూ సురక్షిత ప్రసవమే ధ్యేయంగా కృషి చేయాలన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు వైద్య శిబిరాలు, ఆరోగ్య సర్వే నిర్వహిస్తూ జ్వరాలు, డయేరియా తదితర సీజనల్ వ్యాదులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాదికారులు డా. మానస, డా. నితీషా, డెమో యోగీశ్వరరెడ్డి, సూపర్వైజర్లు శ్రీనివాసరావు, ఇందిరాదేవి, లలితకుమారి, చినబాబు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'నీట్, ఐఐటీ'కు శిక్షణ ఇవ్వాలి : గిరిజన సంక్షేమ సంఘం

విశాలాంధ్ర-బెలగాం : రాష్ట్ర ప్రభుత్వం నారాయణ ప్రైవేటు విద్యా సంస్థల ద్వారా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు "నీట్, ఐఐటీ" కు ఉచిత శిక్షణ ఇవ్వాలని చేసిన ఆలోచన తక్షణమే ఉపసంహరించుకోవాలని గిరిజన సంక్షేమం సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాలక రంజిత్ కుమార్, తాడంగి సాయిబాబులు డిమాండ్ చేసారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ అధ్యాపకులతో ప్రభుత్వ ఆధ్వర్యంలో నేరుగా ప్రభుత్వ కళాశాలల్లో ఉచిత "నీట్, ఐఐటీ" కు శిక్షణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉచిత శిక్షణ భాధ్యత నారాయణ విద్యా సంస్థలకు అప్పచెప్పడం ఏ మాత్రం సరైంది కాదని వారన్నారు. ఐటిడిఎలు ఉన్న జిల్లాలో ఐటిడిఎ కేంద్రంలో గిరిజన విద్యార్థులకు ఈ ఉచిత శిక్షణను ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రతి హామీ నెరవేర్చే దిశగా ప్రభుత్వం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా దశలవారీగా హామీలను అమలు చేస్తూ ముందుకు వెళ్తున్నారని ఎమ్మెల్యే విజయ్‌చంద్ర అన్నారు. శుక్రవారం పట్టణంలో పేదలకు చౌక ధరల దుకాణం ద్వారా ఆయిల్ పంపిణీ ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదవాళ్లంతా మూడు పూటలా పుష్టిగా కడుపు నింపుకునేల ప్రభుత్వం బియ్యంతో పాటు తక్కువ ధరకే పంచదార, వంటనూనె, కందిపప్పు అందిస్తుంద న్నారు. గత వైకాపా పాలనలో బియ్యం తప్ప మరి సరుకులు ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రేషన్ ద్వారా తక్కువ ధరకే సరుకులు అందించడం జరుగుతుందని ఆయన అన్నారు. పామాయిల్ రిఫండ్ ఆయిల్ అందించడం జరుగుతుంద న్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతిఒక్క మాటను నిలబెట్టుకుంటూ రాష్ట్ర సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న కృషి అన్ని వర్గాలకు మంచి జరిగేలా అడుగులు వేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో జెసి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మహిషాసుర మర్ధిని అవతారంలో అమ్మవారు

విశాలాంధ్ర-ఎటపాక : మహిషాసుర మర్ధిని అవతారం లో అమ్మవారు శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఎటపాక మండలం గుండాల కాలనీ కనకదుర్గ యూత్ ఆధ్వర్యంలోని జరుగుతున్న దేవి శరన్నవరాత్రులు చివరి దశకు చేరుకున్నాయి. నవరాత్రులలో భాగంగా శుక్రవారం తొమ్మిదో రోజు అమ్మవారు మహిషాసురమర్ధినిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ అలంకారం విశిష్టత, పూజా విధానం గురించి వివరించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద కార్యక్రమం చేపట్టారు.

సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-అనంతగిరి : మండలం ఎగువశోభ పంచాయితీ కేంద్రంలో 4-50 లక్షల జిల్లా పరిషత్ నిధులతో సి.సి.రోడ్ల నిర్మాణాలను అనంతగిరి జడ్పీటిసి దీసరి గంగరాజు, ఎంపిపి శెట్టి నీలవేణి, సర్పంచ్ కొర్ర సింహాద్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా అనంతగిరి జడ్పీటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీమతి జల్లిపల్లి సుభద్ర తనకు కేటాయించిన నిధులతో వారి సహకారంతో మండలం అభివృద్ధి కాంక్షిస్తూ గ్రామల అభివృద్ధి కోసం ఎగువశోభ పంచాయితీ కేంద్రంలో 4-50 లక్షలతో సి.సి రోడ్డు నిర్మాణాలు వేగవంతంగా పనులు జరుగుతున్నాయి. పల్లెసీమాలే, పట్టుకొమ్మలు పల్లెలు అభివృద్ధి చెందితే మండలాలు అభివృద్ధి చెందుతాయి మండలాలు అభివృద్ధి చెందితే జిల్లా, రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయి. తరతరాలుగా గ్రామంలో వర్షాకాలం వస్తే వీధులు బురదమయంగా మారి ఇబ్బందులు పడుతున్నారు. వారి ఇబ్బందులు ఇప్పుడు తొలగిపోతున్నాయి. మండలంలో మరిన్ని గ్రామల అభివృద్ధి కోసం జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీమతి జల్లిపల్లి సుభద్ర గారి సహకారంతో అభివృద్ధికి అడుగులు వేస్తామన్ని ప్రజలకు తెలియపరచడం జరిగింది ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాంగి.అరుణ, మాజీ సర్పంచ్ పాంగి మొద్దు, ఎగువశోభ ఇంజనీరింగ్ అసిస్టెంట్ బాక.నవీన్, వెల్ఫేర్ అసిస్టెంట్ చంద్రమౌళి, వెటర్నరీ అసిస్టెంట్ సునీల్ ఎగువశోభ గ్రామ పెద్దలు సొంటరి సుబ్బారావు, పొట్టంగి సన్యాసిరావు, యూత్ కాంగ్రెస్ నాయకుడు పాంగి శాంతిరావు, పాస్టర్స్ పాంగి ధయకర్, పాంగి పేతురు, సాగర చందరావు, పాంగినర్సింగరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత... పర్యావరణ పరిరక్షణే 'స్వచ్ఛత ఈ-సేవ' ముఖ్య ఉద్దేశం

సిఆర్పిఎఫ్ ఈ/234 బెటాలియన్ కమాండెంట్ మనోజ్‌కుమార్ యాదవ్

విశాలాంధ్ర-చింతపల్లి : పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణే స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని సిఆర్పిఎఫ్ ఈ/234 బెటాలియన్ కమాండెంట్ మనోజ్ కుమార్ యాదవ్ అన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని సంత మార్కెట్ వద్ద చెత్తను తొలగించి పర్యావరణ పరిరక్షణకు సిఆర్పిఎఫ్ పోలీసులు శ్రీకారం చుట్టారు. సిఆర్పిఎఫ్ ఈ/234 కంపెనీ బెటాలియన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సేనాపతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా సంత మార్కెట్ పరిసరాలలో చెత్తను పోగు చేసి తగలబెట్టారు. అనంతరం ప్రధాన రహదారికి ఇరువైపులా, అదే క్రమంలో పలుచోట్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన మనోజ్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రజా రక్షణతో పాటు పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ తదితర వాటిలో కూడా సిఆర్పిఎఫ్ భాగస్వామి అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ ఎస్ఐ, ఏఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

సంతలో దసరా కళ

విశాలాంధ్ర-దుంబ్రిగూడ : మండలంలోని అరుకు పంచాయతీ కేంద్రంలో శుక్రవారం సంతలో దసరా కళకళలాడింది. దసరా సంత కావడంతో సంత పరివాహక ప్రాంతం కిక్కిరిసిపోయింది. మేకలు, గొర్రెలు, కోళ్ల మంచి గిరాకీ ఏర్పడింది. వస్త్ర దుకాణాల్లో గిరిజనులు చేరుకుని కుటుంబ సమేతంగా నూతన వస్త్రాలు కొనుగోలు చేసి ఇళ్లకు పయనమయ్యారు. ట్రాఫిక్ నియంత్రణను ఎస్సై పాపినాయుడు పర్యవేక్షణలో పోలీసులు చేపట్టారు.

చిన్న జడుమురులో నూతన వాటర్ గ్రిడ్ ప్రారంభోత్సవం

విశాలాంధ్ర-జీకే వీధి : గూడెం కొత్తవీది మండలం సంకాడ పంచాయతీ పరిధిలోని చిన్నజడుమూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన వాటర్ గ్రిడ్ ను సర్పంచ్ నాగులమ్మ ప్రారంభించారు. మంచి నీటి సౌకర్యం లేక ఇన్నాళ్లు చాలా ఇబ్బందులు గురయ్యామని , ఇకపై నుండి కొంతవరకు సురక్షిత నీరు అందుతుందని, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమం లో కార్యదర్శి అరుణ్ కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పావని, గ్రామపెద్దలు దేశగిరి కృష్ణారావు, వలసన్నపడల్, లింగమూర్తి, కూటమి నాయకులు డి. చిట్టిబాబు, ఎల్. రాజారావు, దేశగిరి గోవింద్, సంజీవ్, ఊలం బాబురావు, ఊలం ఈశ్వర్ రావు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చాపరాయిని జాయింట్ కలెక్టర్ సందర్శన

విశాలాంధ్ర-దుంబ్రిగూడ : పర్యటక కేంద్రం చాపరాయి జలవిహారిలో అల్లూరి జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ శుక్రవారం సందర్శించారు. కుటుంబ సమేతంగా సందర్శించిన ఆయన జలవిహారిలో సరదా స్నానాలను ఆచరిస్తున్న పర్యటకులతో మమేకమయ్యారు. గిరిజన మహిళలు ప్రదర్శించిన థింసా నృత్యాన్ని ఆస్వాదించి ఆనందం వ్యక్తం చేశారు. జలవిహారి నిర్వాహకులతో సెల్ఫీలను తీసుకున్నారు.

జిల్లాలో 52 మద్యం షాపులకు 1376 దరఖాస్తులు

- రూ.27.5 కోట్ల రూపాయల ఆదాయం రాక
- ముగిసిన మద్యంషాపుల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం
- సోమవారం జిల్లా కలెక్టర్ సమక్షంలో షాపుల డ్రా
- ఈనెల 16 నుండి కొత్త షాపులద్వారా మద్యం అమ్మకాలు
- ఏఈఎస్ జీవన్ కిశోర్ వెల్లడి

విశాలాంధ్ర-పార్వతీపురం : నూతన మద్యం పాలసీ ద్వారా పార్వతీపురం మన్యంజిల్లాలోని 52 షాపులకుగాను శుక్రవారం ముగింపు నాటికి 1376 దరఖాస్తులు అందాయని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీవన్ కిశోర్ తెలిపారు. దరఖాస్తులను ప్రభుత్వం నిర్దేశించిన రూ.2లక్షలు (నాన్ రిఫండబుల్) రుసుమును చెల్లించి సమర్పించారని చెప్పారు. శుక్రవారం ఒక్కరోజే 250కు పైగా దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. దరఖాస్తు దారులు పార్వతీపురం, సీతానగరం, సాలూరు, కురుపాం, పాలకొండ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లలో దరఖాస్తులను సమర్పించారని తెలిపారు. నూతన మద్యంపాలసీ చాలా పారదర్శకంగా జరుగుతుందని, ఎటువంటి అపోహలు చెందాల్సిన అవసరం లేదన్నారు. కలెక్టర్ సమక్షంలో ఈనెల 14న డ్రాతీసి షాపులను కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 16నుండి నూతన మద్యం షాపులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈనెల 1నుండి దరఖాస్తులు ఆన్లైన్లో, ఆఫ్ లైన్లో వచ్చినట్లు తెలిపారు. ఏది ఏమైనా పార్వతీపురం మన్యం జిల్లాలోని అనుకున్న లక్ష్యానికి తగ్గట్టుగా మద్యం దరఖాస్తులు వచ్చినట్లు వ్యాపారస్తులు తెలియజేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అనూహ్య స్పందన లభించినట్లు వారు తెలిపారు. అధికారులు మాత్రం ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాలేదని తెలియజేయడం గమనార్హం.

సీతానగరం సర్కిల్‌లో... సీతానగరం మండలంలోని సీతానగరం, బలిజిపేట, గరుగుబిల్లి మండలాలకు సంబంధించి ఆన్లైన్ ద్వారా ఆఫ్లైన్ ద్వారా బుదవారం సాయంత్రం నాటికి 12 షాపులకు సంబంధించి 298 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ డి.పద్మావతి తెలిపారు. సీతానగరం మండలంలోని 4 షాపులకు 88 దరఖాస్తులు, గరుగుబిల్లి మండలంలోని మూడు షాపులకు 102 దరఖాస్తులు, బలిజిపేట మండలంలోని 5 షాపులకు 108, దరఖాస్తులు అందినట్లు తెలిపారు. లాటరీద్వారా షాపులు ఎంపిక జరుగుతుందని, పారదర్శకంగా ఎంపిక జరుగుతుందన్నారు. రాత్రి 12 గంటల వరకు దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందని, మరో 21 దరఖాస్తులు వస్తాయనేఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఎస్సై షరీఫ్ సిబ్బంది పి.అప్పలకొండ, కె. గౌరు, జి భూషణరావు, అనంతరావు, టి శేషగిరిలు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన మద్యంషాపుల దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర-దుంబ్రిగూడ : పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యకరంగా ఉండేందుకు దోహదపడుతుందని అరుకు పంచాయతీ సర్పంచి శారద అన్నారు. అరుకు పంచాయతీ కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి వల్లిబాయ్ ఆధ్వర్యాన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. సంత పరివాహక ప్రాంతంతో పాటు, సచివాలయ కార్యాలయ ఆవరణలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే సంపూర్ణ ఆరోగ్యం పొందగలమని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను వేటాడుటకు కరెంటు వైర్లను ఏర్పాటుచేస్తే కఠిన చర్యలు : సీఐ

విశాలాంధ్ర -మారేడుమిల్లి: మారేడుమిల్లి గిరిజన ప్రాంతంలో వన్య ప్రాణులను కరెంట్ వైర్లను ఏర్పాటు చేసి వేటాడడం నేరమని మారేడుమిల్లి సీ.ఐ గోపాలకృష్ణ ఆకు మామిడి కోట గ్రామంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ వన్యప్రాణులను వేటాడు నేరమని అంతేకాకుండా అడవుల్లో జంతువుల కోసం కరెంటు ఏర్పాటు చేయడం నేరమన్నారు., అడవుల్లో కరెంటు వైర్లు ఏర్పాటు చేయడం వల్ల అటుగా ప్రయాణించే రైతులు కరెంట్ వైర్లు తగిలి చనిపోయే ప్రమాదం ఉందన్నారు. ఇటువంటి కార్యక్రమాలకు ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. గతంలో వైరవరం మండలంలో రెండు సంఘటనలు జరిగాయని వాటిని దృష్టిలో ఉంచుకొని ఈ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ గోపాలకృష్ణ ప్రజలకు వివరించి చెప్పారు. అక్రమంగా అడవుల్లో కరెంటు వైర్లను ఏర్పాటు చేసి వేటాడినట్లు తెలిస్తే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు తెలిపారు. ఏ సమస్య ఉన్న నేరుగా నన్ను సంప్రదించవచ్చు అన్నారు. గ్రామాల్లో సారాయి, వంటి మత్తు మత్తు పానీయాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి రవాణాకు దూరంగా ఉండాలని గంజాయి అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మారేడిమిల్లి ఎస్సై రాము, విద్యుత్ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మీకు తెలుసా..? ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర-కురుపాం : యూత్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మీకు తెలుసా కార్యక్రమంలో భాగంగా ఎయిడ్స్/హెచ్ ఐ వి పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది? ఎలా వ్యాపించదు, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపట్ల వివక్షత చిన్నచూపు లేకుండా ఎలాగా సమాజములో కలసి జీవించాలి, హెచ్.ఐ.వి/ఎయిడ్స్, తో భాధపడుతున వారిప వారి పట్ల విపక్షణ చూపించిన వారికి పోలీస్ కేసు పెట్టడం జరుగుతుంది తగు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఆ చర్యలు టోల్ ఫ్రీ నెంబర్ 1097 ఆ నెంబర్ కి ఎవరైనా ఫోన్ చేసి హెచ్ఐవి పేషెంట్ అనే హేళన చేసినవారికి ఈ కే ఇ టోల్ ఫ్రీ నెంబర్‌కి చేసి దర్యాప్తు చేయబడుతుంది ఇది చట్టం వారిపట్ల కేసు నమోదు చేసుకోవచ్చుక్షయ వ్యాధి సంబందం గూర్చి, సుఖ వ్యాధులు, చికిత్స గూరించి, వివరించారు.

14 నుండి పల్లె పండుగ వారోత్సవాలు

విశాలాంధ్ర-అనంతగిరి : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని ఈ నెల 14 తేదీ నుండి 20వ తేదీ వరకు పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని, మండల పరిషత్ అధికారి ఎ వివి.కుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.ఈ నెల 14 న అనంతగిరి. ఎగువశోభ.15 న కొత్తురు. చిలకలగెడ్డ. కాశీపట్నం.16 న బొర్రా. టోకురు. కొండిభ 17న బీంపోలు గురుగుబిల్లి, గుమ్మకోట, రొంపలి, 18న పెద్దబిడ్డ, గుమ్మ, వాలసి, లుంగపర్తి, 19న వేంగడ, పైనంపాడు, కోనాపురం, 20న జీనాబాదు, పిన్నకోట, పెద్ద కోట, కివర్ల పంచాయతీలలో కార్యక్రమాలు జరుగుతా యని, అయితే ఎంజీ ఎన్ఆర్ జీఎస్. గిరిజన సంక్షేమ శాఖ ఆర్‌డబ్ల్యూఎస్ పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టిన పలు అబివృద్ధి పనులపై ప్రజలకు వివరించేందుకుగాను పైన తెలిపిన శాఖల అదికారులు సచివాలయ సిబ్బంది పాల్గొంటారని తెలిపారు.

మృతుల కుటుంబాలకు రూ.10 వేలు జమాల్ ఖాన్ చారిటబుల్ సంస్థ వితరణ

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని బీసీ కాలనీకి చెందిన తుంగ రాంబాబు (48) అనారోగ్య సమస్యతో మరణించడం జరిగింది. మరణించిన వ్యక్తి కుటుంబ సభ్యులకు జమాల్ ఖాన్ చారిటబుల్ సంస్థ ద్వారా మండల టిడిపి నాయకులు ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి , 5000 రూపాయలు సహాయార్థం అతని భార్య తుంగ ముత్యాలు కు చేయూతగా అందించారు. అలాగే అదే గ్రామానికి చెందిన కోట్ల లక్ష్మణరావు ఇటీవల పాము కాటుకు గురైమరణించినందున వారి కుటుంబ సభ్యులకు సహాయంగా సంస్థ ద్వారా 5000 రూపాయలు వితరణ అందించారు.ఈ కార్యక్రమంలో ముత్యాల రామారావు, బొర్ర నరసింహారావు, రహీం ,శేఖర్, ఆదినారాయణ, సూరి, రాజు, శంకర్, బింగి విష్ణుమూర్తి, గడ్డం కృపారావు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు అందక వెతలు... ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఉద్యోగులు

వైకాపా ఎస్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్

విశాలాంధ్ర-చింతపల్లి : ఎన్డీఏ ప్రభుత్వంలో ఉద్యోగులకు వేతనాల వెతలు తప్పడం లేదని, దసరా పర్వదినం నాడు కూడా తమకు వస్తువులు తప్పడం లేదని ఉద్యోగులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని వైకాపా ఎస్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెల్లీ సుధాకర్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నెల ప్రారంభమై పది రోజులు పూర్తి అయినప్పటికీ ఉద్యోగులకు వేతనాలు చెల్లించే విషయంలో ఎన్డీఏ ప్రభుత్వం జాప్యం చేయడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కాలేదన్నారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఉద్యోగుల వేతనాల విషయంలో అధికార వైకాపాపై అనేక ఆరోపణలు చేసిన ఎన్డీఏ కూటమి పార్టీలు అధికారం చేపట్టాక ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించకుండా ఉద్యోగుల కుటుంబాలను పండగ పూట కూడా పస్తులు ఉంచాలని చూస్తోందన్నారు. ఇందులో భాగంగానే ఉద్యోగులకు నేటి వరకు రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు చెల్లించలేదని ఆయన ఆరోపించారు. గతంలో వైకాపా అధికారంలో ఉండగా సకాలంలో వేతనాలు చెల్లించలేదని ప్రతిపక్ష పార్టీలే గాక, ఉద్యోగ సంఘాలు సైతం ఉద్యమించాయని, నేడు అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం దసరా పర్వదినం నాటికి కూడా ఉద్యోగులకు వేతనాలు చెల్లించిన పరిస్థితి ఉందన్నారు. ప్రతిపక్షంలో ఉండగా పరిస్థితులను అర్థం చేసుకోకుండా ఆరోపణలు చేసిన ఎన్డీఏ కూటమి పార్టీల నాయకులు నేడు అధికారంలోకి వచ్చాక ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించని విషయంపై ఎందుకు నోరు మెదపడం లేదని ఆయన ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉండగా ప్రజాపక్షంగా మాట్లాడే ఎన్ డి ఏ కూటమి పార్టీల నాయకులు అధికారంలోకి వచ్చాక ఎందుకు ప్రజాపక్షం వహించడం లేదని ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు.

బురదగడ్డ వద్ద ట్రాఫిక్ జామ్

కోతకు గురైన రోడ్డును మరమ్మత్తు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం

ఇబ్బందిపడిన వాహనదారులు

విశాలాంధ్ర-దుంబ్రిగుడ: స్థానిక మండలంలోని అరకు సరిహద్దులో గల బురద గడ్డ వంతెన వద్ద ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు కోతకు కురవడంతో ప్రమాదకరంగా మారింది. రోడ్డుకు సుమారు సగభాగం రోడ్డు కోతకు గురై ఉన్న మరమతు చేయడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేస్తుండటంతో ఈ రోడ్డు నుండి ప్రయాణించే వాహనదారులు రవాణాకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దసరా పండగ కావడంతో శుక్రవారం అరకు వారపు సంతలో వివిధ వస్తువులు కొనుగోలు చేసుకునేందుకు గిరిజనులు తరలివచ్చారు. దీంతోపాటు టూరిస్టులు సైతం అరకు ప్రాంతంలో అధిక శాతం మంది వాహనాల్లో తరలివచ్చారు. అయితే బురద గడ్డ వంతెన వద్ద రోడ్డు కోతకు గురవడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో ఎండపల్లి వలస నుంచి అరకు వరకు సుమారు రెండు కిలోమీటర్లు దూరం మేరకు వాహనాల రద్దీతో ట్రాఫిక్ జామ్ ఏర్పడడంతో వాహనదారులు ప్రయాణికులు పలు ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయాన్ని తెలుసుకున్న అరకులోయ ఎస్సై గోపాల్ రావు హుటాహుటిన బురద గడ్డ వద్ద చేరుకుని పోలీస్ సిబ్బందితో ఈ రుపక్కల నిలిచిపోయిన వాహనాలను తరలించి ట్రాఫిక్ జామ్ కు అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవడంతో మళ్లీ యధావిధిగా వాహనాలు రాకపోకలు సాగించాయి.

రింతాడలో దేవీ నవరాత్రులలో భాగంగా భారీ అన్న సమరాధన

విశాలాంధ్ర-జీకే వీధి : మండలంలోని రింతాడ గ్రామంలో శ్రీశ్రీ దుర్గాదేవి అమ్మవారి నవరాత్రులలో భాగంగా గ్రామస్తులు, చుట్టుపక్కల భక్తులు తరలివచ్చి దుర్గమ్మ తల్లి ని దర్శించుకుని పూజలు చేశారు. గ్రామస్తులు, భవాని భక్తులు అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు..ఈ కార్యక్రమానికి రింతాడ పంచాయితీ నలుమూలల గ్రామాల నుండి భక్తులు తరాలి వచ్చి, అమ్మవారిని దర్శించుకుని, అన్నసంతర్పణ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి రింతాడ గ్రామస్తులు భవాని భక్తుల సహకారంతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

రిజిస్టర్డ్ ల్యాండ్ డాక్యుమెంటు పోయినది

నా పేరు గేదెల విజయకుమార్, తండ్రి (లేటు) సత్యనారాయణ, నేను గాయిత్రీనగర్, పాలకొండలో నివాసం ఉంటున్నాను. పాలకొాద ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి గాయిత్రీనగర్‌కు వస్తుండగా మార్గమధ్యలో రిజిస్టర్ డాక్యుమెంట్ 1243/1996 పోయినది. ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది ఫోన్ నెంబర్లకు తెలియజేయగలరు.

ఫోన్ నెం. 8950594405, 7997641919

విశాలాంధ్ర
పేజీ : 2
అల్లూరి సీతారామరాజు
పార్వతీపురం మన్యం
శనివారం 12, అక్టోబరు 2024

ఎన్టీఆర్ ట్రస్టు, జీఎస్ఆర్ పౌడేషన్ మెగా మెడికల్ క్యాంప్

విశాలాంధ్ర-గంగవరం : ఎన్టీఆర్ ట్రస్ట్ జిఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని జగ్గంపాలెంలో మీఅక్క మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపును నారా భువనేశ్వరి, డాక్టర్ గోరంట్ల రవి రామ్‌కిరణ్ వారు రంపచోడవరం నియోజకవర్గ ఎన్టీఆర్ ట్రష్టు ఇంచార్జీ కందుల సాయి బాబు ఆధ్వర్యంలో నిర్వహించి సుమారు 500 మందికి వైద్య సేవలు అంధించారు. సందర్భంగా రంపచోడవరం నియోజకవర్గం ఎన్టీఆర్ ట్రస్ట్ ఇంచార్జ్ కందుల సాయిబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమానికి స్థానిక మాజీ ఎంపీపీ డా. తీగల ప్రభ, తెలుగుదేశం పార్టీ నాయకులు చవలం రాధకృష్ణదొర, పులిగే గోవిందరాజు, కోసు రాము, బోరగ చిన్నబ్బాయి దొర, తంగెల్లా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి : ఎమ్మెల్యే విజయచంద్ర, పిఓ అశుతోష్ శ్రీవాస్తవ

విశాలాంధ్ర-పార్వతీపురం/పార్వతీపురం టౌన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించి మార్గదర్శకులుగా నిలవాలని స్థానిక శాసన సభ్యులు బోనెల విజయ చంద్ర, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీ వాస్తవ పిలుపు నిచ్చారు.జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవ వేడుకలు స్థానిక గిరిమిత్ర సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు బోనెల విజయచంద్ర, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ ముఖ్య అతిథిలుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ మహిళల జీవితంలో కౌమారదశ చాలా కీలకమని అన్నారు. అధునాతన సాంకేతికతకు తగ్గట్టుగా బాలికలు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే చాలా మంది మహిళలు దేశానికి వెన్నెముకగా నిలిచారని, రాబోయే తరం కూడా అదే స్థాయిలో నిలవాలని ఆయన ఆకాంక్షించారు. బాలికలను రేపటి పౌరులగా తీర్చిదిద్దడంలో మహిళల పాత్ర చాలా కీలకమని, ఈ విషయంలో తల్లులు, ఉపాధ్యాయులు, అంగన్వాడి, ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశా వర్కర్లు చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. బాలికలు, మహిళలు ప్రభుత్వ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. చట్టాలపై పూర్తి అవగాహన ఉన్నప్పుడే మహిళలు స్వతంత్రులుగా సమాజంలో నిలబడగలరని పేర్కొన్నారు. బాలికలు ఎదుర్కొనే సవాళ్లను పరిష్కరించడం, బాలికల సాధికారత, బాలికల హక్కులను ప్రోత్సహించడం వంటి వాటిపై అంతర్జాతీయ బాలికా దినోత్సవం దృష్టి సారిస్తుందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. నేటి బాలికలు రేపటి వ్యాపారవేత్తలుగా, రాజకీయ నాయకులుగా, మార్గదర్శకులుగా, ఇంటి పెద్దలుగా అభివృద్ధి చెందాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీ వాస్తవ మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి పిలుపు మేరకు ప్రతి ఏడాది అక్టోబరు 11న అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. చాలా కాలం తర్వాత మహిళలు విద్య, పోషణ,

చట్టపరమైన హక్కులు, బాల్య వివాహం, వివక్షతల పై పూర్తి అవగాహనతో ఉన్నారని అన్నారు. సమాజంలో మార్పు కనబడుతుందని, మనం ఈమార్పునువేడుకగానిర్వహించుకోవాలని అన్నారు. బాలికలు విద్యావంతులైతే ప్రపంచాన్ని మార్చగల సామర్థ్యాన్ని కలిగి ఉంటారని అన్నారు.బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను, అనర్థాలను నివారించి, వారి హక్కులను తెలియజేసేందుకు ఐక్యరాజ్యసమితి ఈ దినోత్సవాన్ని ప్రకటించిన సంగతిని గుర్తు చేశారు. ప్రపంచవ్యాప్తంగా బాలికలు ఎదుర్కొంటున్న లింగ అసమానతలు, ఇతర అంశాలపై అవగాహన పెంచడమే ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యం ఆయన పేర్కొన్నారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి యం.ఎన్.రాణి మాట్లాడుతూ భవిష్యత్తు కోసం అమ్మాయిల దృష్టి ఈ ఏడాది నినాదంన్నారు. ఆడపిల్లలు ఎదుర్కొంటున్న అసమానతలను ఎత్తి చూపడం, ఆడపిల్లల హక్కులు, విద్య, ఆరోగ్యం, పోషకాహార ప్రాముఖ్యతతో సహా అవగాహనను ప్రోత్సహించడం దీని వెనుక ఉన్న ప్రధాన లక్ష్యం అన్నారు. బాలికలు, యువతులు వారి రంగాలలో ప్రచారం, పరిశోధనలకు సంబంధించి సాధించిన అభివృద్ధిని ప్రతిబింబించేలా ఈ దినోత్సవ వేడుకలు జరుపుకోవాలన్నారు.ఈ వేడుకల్లో డిప్యూటీ డియం%డ%హెచ్ఓ జగన్మోహన్, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎ.సత్యనారాయణ, పార్వతీపురం సిడిపిఓ బి. శ్రీనివాసరావు, అప్ హెూల్డ్ ఎన్జిఓ కోఆర్డినేటర్ రాజశేఖర్, ప్రజాప్రతినిధులు, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, పోలీస్ సిబ్బంది.మహిళలు పాల్గొన్నారు.

పీఎం జన్మన్ పథకాన్ని పివిటిసి గ్రామాల్లో పూర్తిస్థాయిలో అమలు చెయ్యాలి

- చేరువులవేనం వ్యూ పాయింట్ అభివృద్ధికి ఐటిడిఏ నిధులు కేటాయించాలి
- సీపీఎం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ధనుంజయ్

విశాలాంధ్ర- చింతపల్లి : పివిటిజీలకు పిఎం జన్మన్ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలుచేయాలని సిపిఎం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పాంగి ధనుంజయ్ అన్నారు. ఆ పార్టీ శాఖా కార్యదర్శులు మర్రి నాగేంద్ర కుమార్, పాంగి కామేశ్వరరావుల ఆధ్వర్యంలో చెరువుల వనం గ్రామంలో శుక్రవారం శాఖ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కమిటీ సభ్యుడు సాగిన చిరంజీవి తో కలిసి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ధనుంజయ్ మాట్లాడుతూ పివి టీజీలకు ప్రధానమంత్రి జన్మన్ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో దేశంలోని 27 రాష్ట్రాలలో పివిటిజీ లకు సంబంధించి 24 వేల కోట్లు విడుదల చేసి అభివృద్ధి చేయాలని ఆ పథకం ప్రవేశపెట్టినప్పటికీ నేటికీ పివిటిజి గ్రామాల్లో పథకం అమలుకు నోచుకోవడం లేదని ఆరోపించారు. ముఖ్యంగా పివిటిజిలకు గృహాల మంజూరు, గ్రామాల్లో అంగన్వాడి కేంద్రం, పాఠశాల భవనాలు, త్రాగునీరు, రహదారులు తదితర మౌలిక సౌకర్యాల కొరకు ఈ పథకం నిధులు ఖర్చు చేసి అభివృద్ధి చేయాలని ఉన్నప్పటికీ వాస్తవంగా చూస్తే పివిటిజి గ్రామాల్లో గృహ కల్పనకు నోచుకోలేదన్నారు. రహదారులు లేక అనారోగ్య పరిస్థితులు ఏర్పడినప్పుడు డోలీ మోతలతో మార్గమధ్యలో మరణాలు సంభవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్యలతో ఇబ్బంది పడుతూ రోగాల బారిన పడుతున్నారని, గ్రామాల్లో పారిశుధ్యం లోపించి ఇబ్బందులు పడుతున్నారని అంగన్వాడిలు, పాఠశాల భవనాలు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ఈ పథకం ప్రకటన వరకే తప్ప అమలు చేయడం లేదని మండిపడ్డారు. తక్షణమే పథకం అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుని గ్రామాల్లో అభివృద్ధికి చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో దేశవ్యాప్తంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలను చేపడతామన్నారు. టూరిజం పేరుతో చెరువులో వేనం గ్రామంలో వ్యూ పాయింట్ గా గుర్తించి స్థానిక నిరుద్యోగ యువత సొసైటీగా ఏర్పాటు చేసుకొని వారి ఆధ్వర్యంలో ప్రకృతి ,పర్యావరణానికి నష్టం కలగకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ సుందరంగా ఉంచడంతో మైదాన ప్రాంతం నుంచి వచ్చే టూరిస్టులు వేలాదిమంది వ్యూ పాయింట్ సందర్శించి ఆస్వాదిస్తున్నారన్నారు. పర్యాటకులకు (మహిళలకు) రెస్టు రూములు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. పర్యాటకులను ఆకర్శించడానికి మన్య ప్రాంతాన్ని సుందరంగా అభివృద్ధి పరచాలన్నా నిధులు లేక సొసైటీ సభ్యులు సతమవుతమవుతున్నారన్నారు. ఐటీడీఏ వ్యూ పాయింట్ నడుపుతున్న సొసైటీ సభ్యులైన నిరుద్యోగ యువతకు అభివృద్ధి కోసం ఆర్థిక ప్రోత్సహకాలను అందించి ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకునేలా ఐటిడిఏ ఆదుకోవాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు పాంగి సత్తిబాబు, చంటిబాబు, సుందరావు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమానికి జమాల్ ఖాన్ వితరణ

విశాలాంధ్ర-ఎటపాక : దసరా ఉత్సవాల సందర్భంగా ఎటపాక మండలం గుండాల కాలనీలో శరన్నవరాత్రి లో భాగంగా అన్నదాన కార్యక్రమానికి ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ శుక్రవారం గ్రామస్తులకు పదివేల రూపాయల నగదును అందజేశారు. ఈ సందర్భంగా జమాల్ ఖాన్ మాట్లాడుతూ సాంప్రదాయ పండుగలు సమిష్టిగా సంతోషంగా అందరూ కలిసి ఏవిధంగా సందడిగా నిర్వహించుకుంటారో అదేవిధంగా గ్రామ ప్రజలందరూ కష్టసుఖాల్లో కలిసి ఉండాలని భారతదేశంలో భిన్నత్వంలో ఏకత్వంగా అన్ని మతాలు కులాలు కలిసి అన్నదమ్ముల వలె జీవించే అరుదైన దేశం భారతదేశం అని చెప్పుకునేందుకు నేడు అందరూ గర్వపడుతున్నారని యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా భక్తి భావాలతో తల్లిదండ్రుల పట్ల వినయ విధేయత కలిగి మంచి అలవాట్లను అలవర్చుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రూప లక్ష్మి, జితేష్, రాము, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుధపూజకు తరలి వెళ్లిన నేతలు, అధికారులు, అభిమానులు



విశాలాంధ్ర-సీతానగరం : బొబ్బిలి రాజ కుటుంబంలో శుక్రవారంనాడు దసరా సందర్భంగా ఆయుధపూజా కార్యక్రమాన్ని బొబ్బిలిరాజులు సుజయ్ కృష్ణ రంగారావు, బేబీనాయన, రామ్ నాయనలు ఘనంగా నిర్వహించారు. బొబ్బిలి కోటలో ఉన్న ఆయుధాలకు పూజలు చేయడంతోపాటు ప్రదర్శన నిర్వహించారు.పార్వతీపురం ఎంఎల్ఏ విజయ్ చంద్ర తన అనుచరులతో కలిసి వెళ్ళి బొబ్బిలి కోటలో జరిగిన ఆయుధ పూజలో పాల్గొన్నారు.బొబ్బిలి, పార్వతీపురం, కురుపాం, సాలూరు నియోజకవర్గంలోని రాజుల అభిమానులు, టీడీపి బిజెపి జనసేన ప్రజా ప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఐదు లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

విశాలాంధ్ర-గంగవరం : ఐదు లీటర్ల సారా తో కొత్తాడ గ్రామానికి చెందిన సున్నం నూకన్న దొర అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై భూషణం తెలిపారు. సారా అమ్ముతున్నట్లు తెలిసిన సమాచారం మేరకు దాడి చేసి పట్టుకోవడం జరిగిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలని దుర వ్యసనాల వల్ల ఆరోగ్యంతో పాటు ఆర్థికంగా నష్టపోవడం జరుగుతుందన్నారు.

పాపికొండల విహారయాత్ర బోట్ టూరిజం పున:ప్రారంభం

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : గత మూడు నెలలుగా నిలిచిపోయిన పాపికొండలు బోట్ టూరిజం నేటి నుండిప్రారంభం అయిందని టూరిజం యూనియన్ సభ్యులు తెలియజేశారు. శుక్రవారం రేఖపల్లిబోర్డ్ టూరిజం కార్యాలయం నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలోబోట్టూ రిజం కమిటీ సభ్యులు మాదిరెడ్డి సత్తిబాబు వాళ్ళ రంగారెడ్డి మాట్లాడుతూ పర్యాటక రంగంలో పాపికొండలు అత్యంత ఆహ్లాదకరమైన అనుభూతిని ఇచ్చే ఒక విహారయాత్రఅని అన్నారు. నాలుగు నెలలుగా ఆగిపోయిన టూరిజం నేటి నుండి ప్రారంభమవ్వటం సంతోషంగా ఉందని వారన్నారు మొత్తం 21 బోట్లు ఉన్నాయని అందులో 9 బోట్లకు పర్యాటకానమతులు వచ్చాయని మిగిలిన వాటికి కొద్ది రోజుల్లో అనుమతులు వస్తాయని ఆశిస్తున్నామని వారు అన్నారు నే టి నుంచి పర్యాటకులు ఆన్లైన్ ద్వారా లేదా ఏజెంట్ల ద్వారా టికెట్లు బుకింగ్ చేసుకుని పాపికొండలు విహారయాత్రలో పర్యటించవచ్చునని అన్నారు. యూనియన్ సభ్యులు పర్యాటకుల కోసం సర్వం సిద్ధం చేశారని నాణ్యమైన సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. నేటి నుండి మయూరి, రామ రెండు బోర్డులు ద్వారా ప్రారంభమవుతుందని ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చింతూరు ఏఎస్పి, చింతూరు ఐటిడిఏ పివో విచ్చేస్తున్నారని వారి ద్వారా అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

వాలీ బాల్ టోర్నమెంట్‌కు జమాల్‌ఖాన్ ప్రైజ్ మనీ అందజేత

విశాలాంధ్ర-ఎటపాక : వాలీబాల్ టోర్నమెంట్ క్రీడలకు ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ 30 వేల రూపాయల ప్రైజ్ మనీను అందజేశారు. గత వారం రోజులుగా మండలం బొజ్జిగుప్ప గ్రామంలో నిర్వహిస్తున్న బిజెపి నాయకులు మూడే సతీష్ కుమార్ నాయకులు ఆధ్వర్యంలో నిర్వహించారు. వాలీబాల్ ఫైనల్ శుక్రవారం ఫైనల్ నిర్వహించారు. ఈ ఫైనల్ వాలీబాల్ క్రీడకు ముఖ్యఅతిథిగా జమాల్ ఖాన్ను ఆహ్వానించగా ఫైనల్ క్రీడా టాస్ వేశారు. గొమ్ము కోయగూడెం కన్నాపురం టీమ్లు తలపడ్డాయి. అనంతరం ఆయన గెలుపొందిన గొమ్ము కోయగూడెం గ్రామానికి చెందిన టీంకు మొదటి ప్రైజ్ బహుమతి 15 వేల రూపాయలు. రెండవ ప్రైజ్ మనీ 10 వేల రూపాయలు. మూడవ ప్రైజ్ మనీ 5000 రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు దేశ గ్రామ కీర్తి ప్రతిష్టలను పెంచే విధంగా తోడ్పడతాయని ప్రతి ఒక్కరు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ తమ ఆరోగ్యాలను కాపాడుకుంటూ తల్లిదండ్రుల పట్ల ప్రేమతో మెలగాలని నేటి యువత గంజాయి గుట్కా పంటి ప్రమాదకర అలవాట్లకు బానిసలు అవుతున్నారని ఇటువంటి దురాలవాట్లకు దూరంగా ఉండి మంచి క్రీడలను విద్యను అభ్యసించాలని దేశానికి గ్రామానికి మంచి పేరు ప్రతిష్టలను తెచ్చే విధంగా యువత పాటుపడాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. అనంతరం మెమొంటోలను, గెలుపొందిన వారికి బెస్ట్ రన్నర్స్ కు కప్పులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ముప్వ శ్రీను, పార్టీ చలపతి, మాజీ ఎంపీపీ ఉబ్బా, సత్యం బొజ్జి గొప్ప సర్పంచ్ కారం వెంకటేశ్వర్లు, సల్లజాల శ్రీకాంత్, మోడీ సతీష్ కుమార్ బీజేవైఎం, బాచినేని శ్రీకాంత్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మహిషాసుర మర్ధినిగా అమ్మవారు

విశాలాంధ్ర-మక్కువ : మన్యం జిల్లా మక్కువ మండలం శంబర గ్రామంలో వేంచేసియున్న ప్రముఖ ఇలవేల్పు ఉత్తరాంధ్ర గిరిజన ఆరాధ్య దేవత కోరిన కోరికలు తీర్చే కల్పవల్లి శ్రీ శ్రీ శ్రీ పోలమాంబ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవంలో భాగంగా ఈరోజు అనగా శుక్రవారం 9వ రోజు మహిషాసుర మర్దని అవతారంలో శ్రీ అమ్మవారు దర్శన భాగ్యం భక్తులకు కలిగినది. ముందుగా మండప పునః పూజ జరిగినది. తదుపరి భక్తులచే కుంకుమ పూజలు పరివారలకు చేయడమైనది. తదుపరి విశేష హెూమం, విశేష సహస్ర కమల హెూమం, 1008 కలవపూవులతో విశేష హెూమములు జరిగినవి. సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ, ఆయుష్ హెూమములు నిర్వహించడమైనది. ఈ కార్యక్రమమునకు భక్తులు అత్యధికంగా విచ్చేసి శ్రీ పోలమాంబ అమ్మవారి విశేష హెూమంలో పాల్గొని శ్రీఅమ్మవారి దివ్య ఆశీస్సులు పొంది తరించిరి. పై కార్యక్రమంలను విజయనగరం వాస్తవ్యులు బ్రహ్మశ్రీ కప్పగంతుల శ్రీనివాసశర్మచే శాస్త్రోక్తంగా నిర్వహించడమైనది. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేయడమైనది. భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్య నిర్వహణ అధికారి శ్రీ వివి సూర్యనారాయణ తగు ఏర్పాట్లు చేశారు